
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 21 సెప్టెంబరు 2025



చీపురు పట్టి శుభ్రం చేస్తున్న సీఎం చంద్రబాబు

"చెడు చేయడానికి ఒక నిమిషం చాలు. మంచి చేయాలంటే చాలా సమయం పడుతుంది. నా శేష జీవితం పేదలకే అంకితం. సంక్షేమ పథకాలను ఒక బాధ్యతగా ఇస్తున్నాను. నిరుపేదలను ఆదుకునేందుకు సూపర్ సిక్స్ తీసుకువచ్చాను. పేదల సమస్యల పరిష్కారం కోసం.. వారు ఆర్థిక ఎదుగుదల కోసమే పీ-4ను అమలు చేస్తున్నాను.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు బంగారు కుటుంబాల కార్యక్రమంపై తన ఆలోచన విధానాన్ని స్పష్టం చేశారు."



ఆప్యాయంగా పలకరింపు..



యాదవుల బజారు వాసులతో మాట్లాడుతున్న సీఎం



స్వచ్ఛరథాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



స్వచ్ఛరథాలను పరిశీలిస్తూ..



స్టాల్‌లో రైతుతో మాట్లాడుతూ





మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

చాలా కాలం తర్వాత మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చిందని, ఈ ఆనందం అందరి ముఖాల్లో కనిపిస్తోందని.. ఇది శాశ్వతంగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మాచర్లలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇక్కడ మళ్లీ టీడీపీ జెండాను ఎగురవేశారని.. మాచర్ల వచ్చినపుడు అఖండ స్వాగతం పలికారని సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడో రాజీవ్ గాంధీ హత్య జరిగిన సందర్భంగా మాచర్లలో ఉండే రౌడీలు, ముఠా నాయకులు ఇక్కడి ప్రజల ఆస్తులను విధ్వంసం చేశారని గుర్తుచేసుకున్నారు. ఎన్నికల ముందు వరకు మాచర్లలో ప్రజాస్వామ్యం, ఎన్నికలు లేవన్న చంద్రబాబు నాయుడు.. చరిత్రలో డిక్టేటర్లకు పట్టిన గతే ఇక్కడి నేతలకు పట్టిందన్నారు. ఇకనైనా ఆ నేతలు పద్ధతులు మార్చుకోకపోతే వారిని ప్రజాస్వామ్యం క్షమించదని తీవ్రంగా హెచ్చరించారు.

- ప్రతి ఒక్కరి ముఖాల్లో ఆ ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది
- చాలా కాలం తర్వాత ఇక్కడ టీడీపీ జెండా ఎగుర వేశారు
- చెత్త క్లీన్ చేసినట్లే.. చెత్త రాజకీయాలను క్లీన్ చేస్తా..
- గత ఐదేళ్లలో నాలాంటి నాయకుడే మాచర్లకు రాలేకపోయారు..
- ఇప్పుడు అందరూ స్వేచ్ఛగా వస్తున్నారు..
- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ప్రాంతంలోని అత్మకూరు గ్రామానికి చెందిన వారిని గ్రామం నుంచి వెళ్లగొట్టారు. వారిని అత్మకూరుకు తీసుకొస్తుంటే నన్ను అడ్డుకున్నారు. నా నివాసానికే తాళ్లు కట్టారు. ఆ తాళ్లే వారికి ఉరి తాళ్లుగా మారాయి. గతంలో ఇక్కడ చాలానే అరాచకాలు జరిగాయి. మాచర్ల మునిసిపల్ ఎన్నికల్లో పార్టీ నేతలపై దాడి చేశారు. అందుకే నేను చెబుతున్నాను రాయలసీమలో ముఠాలు లేకుండా చేశాను. పల్నాడులో ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండండి (మిగతా 8వ పేజీలో)





- దత్తత తీసుకున్న కుటుంబాలతో సీఎం చంద్రబాబు, మార్గదర్శకులు

రెండు బంగారు కుటుంబాలు దత్తత

- ముందుకు వచ్చిన మార్గదర్శకులు
- పిల్లలను చదివించాలని సీఎం సూచన

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాచర్లలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర సభ పేద కుటుంబాలను ఆదుకునేందుకు వేదికైంది. సీఎం చంద్రబాబు నాయుడి సమక్షంలో రెండు బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకున్నారు. ఆ కుటుంబాల ఆర్థిక పురోగతికి ప్రణాళికలు రూపొందించాలని చంద్రబాబు మార్గదర్శకులకు సూచించారు. మాచర్ల పట్టణంలోని 11వ వార్డుకు చెందిన బత్తుల నీలావతిని బంగారు కుటుంబంగా ఎంపిక చేశారు. అమె పడుతున్న ఇబ్బందులను చంద్రబాబు సమక్షంలో తెలియజేసింది. తల్లిదండ్రులు చిన్న వయస్సులో పెళ్లి చేశారని.. తన భర్త మరణించాడని, ముగ్గురు మగ పిల్లల పోషణకు కూలీ పనులకు వెళ్తున్నట్లు గోడు వెళ్లబోసుకుంది. ముగ్గురు పిల్లలకీ 'తల్లికి వందనం' లబ్ధి చేకూరిందని చెప్పింది. తన తల్లిదండ్రులు కూడా కూలికి వెళ్తుంటారని, అత్త మామలు కూడా సహకరించడం లేదని బాధపడింది. వితంతు పింఛను (మిగతా 8వ పేజీలో)



వివిధ సంఘాలకు చెక్కు అందజేస్తూ..



వైద్యులతో మాట్లాడుతూ..


మాచర్ల నియోజకవర్గానికి జలజీవన్ మిషన్, మాచర్ల పట్టణానికి అమృత స్కీం, వంద పడకల హాస్పిటల్, పట్టణాభి వృద్ధికి ప్రత్యేకంగా రూ.50 కోట్ల నిధులతో పాటు మిర్చి బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. మాచర్ల ప్రాంతంలో రక్తం పారించిన చోటే నీటిని పారించి అభివృద్ధి చేస్తానన్నారు.



పక్కనే నాగార్జున సాగర్ ఉన్నా.. మాచర్లకు నీరు లేదని, ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే విధంగా అన్ని నదులను అనుసంధానం చేసే బాధ్య తను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గోదావరి జలాలను కుడి కాల్వకు తీసుకొస్తామన్నారు.



పల్నాడు జీవనాడి వరికపూడిశెల సఫలీకృతం చేసే బాధ్యత తాను తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు. దీని ద్వారా 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్న సీఎం.. లక్షమందికి తాగు నీరు అందించే అవకాశం ఉందన్నారు. మొదటి దశలో 1.25 టీఎంసీలు, రెండవ దశలో 6.5 టీఎంసీలు నీరు అందజేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.



బాలికల అక్రమ రవాణా నిర్మూలించాలి

- ఎన్జీవోలకు న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ సూచన

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల అక్రమ రవాణా నిర్మూలనకు అందరూ సహకరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 13వ అదనపు జిల్లా న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఎన్జీవోలతో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. మహిళలు, బాలికల అక్రమ రవాణా నిర్మూలనపై ఎన్జీవోలు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు అన్ని విధాలైన సహాయ సహకారాలు అందించాలన్నారు. హెచ్ఐవీ నిర్మూలనకు, ట్రాన్స్‌జండర్ల హక్కుల పరిరక్షణకు ఎన్జీవోలు చర్యలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు చొరవ తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల సంభవించే నష్టాలు వివరించి కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఐవీపై అవగాహన కొరకు ఆరోగ్య శాఖ తయారు చేసిన కరపత్రాలను న్యాయాధికారి సత్యశ్రీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవోల ప్రతినిధులు హృదయరాజు, మీరా, డేవిడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ

ఫిట్‌లైన్లపై.. నిర్లక్ష్యం

పెంచుకోవడంపై దృష్టి సారించని గుంటూరు డివిజన్

- దశాబ్దాలు గడుస్తోన్నా నేటికీ మూడుకు మించి పెరగని సంఖ్య
- రేపల్లె, మాచర్లలో ఏర్పాటు చేసుకుంటే కొత్త రైళ్ల మంజూరుకు అవకాశం

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ ఏర్పడి దశాబ్దాలు గడుస్తోంది. అయితే మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకంజలోనే ఉంది. గుంటూరు తర్వాత ఏర్పడిన డివిజన్లు మౌలిక సదుపాయాలను కల్పించుకుని కొత్తగా రైళ్లను మంజూరు చేసుకుంటూ ప్రయాణికులకు చేరువ అవుతున్నా యి. పైగా ఆదాయాలను పెంచుకుంటూ వెళ్తు న్నాయి. అయితే గుంటూరు డివిజన్ మాత్రం ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా కొత్తగా రైళ్లు మంజూరు చేయాలంటే ప్రాథమికంగా చూసే పిట్‌లైన్ల సంఖ్య ని పెంచుకోవడంపై దృష్టి సారించడం లేదు. నేటికీ గుంటూరులో రెండు, నల్లపాడులో ఒక పిట్‌లైన్ మాత్రమే అందుబాటులో ఉన్నా యి. ఈ కారణంగా ఏదైనా రైలు గుంటూరు నుంచి ప్రారంభించాలంటే రైల్వే శాఖ వెనకడుగు వేస్తున్నది. పొరుగున ఉన్న ఇతర డివిజన్లు పిట్‌లైన్ సంఖ్యని గణనీయంగా పెంచుకుంటూ నూతన రైళ్లను మంజూరు చేయించుకుంటుంటే గుంటూరు డివిజన్ మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. రైళ్లను ప్రైమరీ మెయిన్‌టెన్స్ చేయాలంటే కచ్చితంగా పిట్‌లైన్లు ఉండాల్సిం దే. ఇవి ఎన్ని ఎక్కువగా ఉంటే అంత మంచిది. ఇందుకు కారణం ప్రైమరీ మెయిన్‌టెన్స్ సదుపాయం ఉంటే రైళ్లను ఇక్కడి నుంచే రైల్వేబోర్డు ప్రారంభిస్తుంది. అలానే అదర్ ఎండ్ మెయిన్‌టెన్స్(ఓఈఎం)ని కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో రేపల్లె, మాచర్ల టెర్మినల్స్‌గా ఉన్నాయి. రేపల్లె నుంచి రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నాయి. మాచర్లకు మాత్రం ఎలాంటి ఎక్స్‌ప్రెస్ రైలు సదుపాయం లేదు. కేవలం ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ప్రయాణిస్తుంటాయి. ఈ రెండు చోట్ల అవ సరమైతే భూసేకరణ జరిపి పిట్‌లైన్లను నిర్మించుకోగలిగితే కొత్త రైళ్లను ఈ టెర్మినల్స్ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రవేశ పెట్టేందుకు అవకాశం ఉంటుంది.

ఎంపీలైనా స్పందించాలి..

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, గుంతకల్లు తదితర డివిజన్లలో పెద్దసంఖ్యలో పిట్ లైన్లు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పలు రైళ్లు మంజూరు కాగా ప్రయాణికులకు సౌకర్యంగా ఉంది. ఒక విధంగా ఈ జోన్‌లో అతి తక్కువ సంఖ్యలో పిట్‌లైన్లు కలిగిన డివిజన్‌గా గుంటూరు ఉన్నది. కొద్ది రోజుల్లో ఎస్‌సీఆర్ జోన్ నుంచి గుంటూరు డివిజన్ విడిపోయి సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి చేరబోతున్న దృష్ట్యా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖకు నివేదించి కొత్త పిట్ లైన్లు మంజూరు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పేదల గూటికి బాబు భరోసా

- ఇంటి నిర్మాణానికి రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం
- ఎస్సీ, బీసీలకు మరో రూ. 50 వేలు
- ఎస్టీలకు రూ. 75 వేలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అద్దె గృహాల్లో మగ్గుతున్న పట్టణ పేదలకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శుభవార్తను ప్రకటించింది. పేదల ఇంటి నిర్మాణానికి రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఎస్సీ, బీసీలకు అదనంగా మరో రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు ఇవ్వాలని తీర్మానించింది. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం 2.0 కింద కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఇంటి నిర్మాణాల వ్యయాన్ని రూ 2.50 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో కేంద్రం రూ. 1.50 లక్షలు ఇవ్వనుండగా.. రాష్ట్ర ప్రభుత్వం దీనికి మరో రూ. లక్ష జోడించి ఇవ్వనుంది. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకంలో భాగంగా పురపాలక సంఘాల్లో అర్హులైన వారందరికీ గృహ నిర్మాణశాఖ గృహాలను మంజూరు చేసింది. ప్రస్తుతం సొంత స్థలం ఉన్న వారికే ప్రాధాన్యమిస్తున్నారు. ఇళ్లు లేని పేదలు సొంత స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఇతర పత్రాలతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైతే ఇంటిని మంజూరు చేస్తారు.

సాగర్‌లో 24 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు శనివారం 24 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయ నీటిమట్టం 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. 24 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు మేర ఎత్తి 1,87,344 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 2,38,745 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 2,38,745 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



24 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- రద్దీకి అనుగుణంగా బస్సులు
- డీపీటీవో విమల

ఒంటెద్దు వాహనాన్ని ఢీకొన్న బైక్
- ప్రమాదంలో తండ్రీకుమార్తె మృతి
- తీవ్రంగా గాయపడ్డ తల్లీ ఆరు నెలల పసికందు

6లో..

తెలుగు భాషోద్దీపనం ద్వారానే సాంస్కృతిక వికాసం
- లఘు చిత్రాల ప్రదర్శన సభలో వక్తలు

8లో..

'గ్రూప్-1' అవకతవకలపై సీబీఐతో విచారణ జరపాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు మహంకాళి సుబ్బారావు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో అవకతవలకు పాల్పడిన వారిపై సీబీఐతో విచారణ చేయించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు మహంకాళి సుబ్బారావు శనివారం డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను ఆనాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ఏక పక్షంగా థర్డ్ పార్టీకి ఇచ్చి డిజిటల్ మూల్యంకనం చేయించారని ఆరోపించారు. నోటిఫికేషన్‌లో డిజిటల్ మూల్యంకన పద్ధతి గురించి పొందుపరచ లేదు కాబట్టే పాత పద్ధతిలోనే మ్యాన్యువల్ మూల్యంకనం చేయించాలని హైకోర్టుకి వెళ్లామని చెప్పారు. కోర్టు మ్యానువల్ పద్ధతిలోనే మూల్యంకనం చేయాలని సూచించినట్లు తెలిపారు. అయితే మాన్యువల్ మూల్యంకనాన్ని ప్రైవేట్ ప్రాపర్టీ అయిన హాయ్ ల్యాండ్‌లో చేశారని, ఏపీపీఎస్సీ ఛైర్మన్, సభ్యులు కలిసి వారికి అనుకూలమైన అభ్యర్థులకు మార్కులు వేసుకొని నియమించుకున్నారని ఆరోపించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాలలో తప్పులు జరిగాయని అన్నారు. వీటిపైన సీబీఐతో విచారణ చేయించాలని చంద్రబాబును కోరామని, కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు దాటినా తమ నిర్ణయాన్ని చెప్పకుండా దాటవేస్తోందని ఆరోపించారు.

రైల్వే ఉద్యోగుల ఆరోగ్యమే మాకు ప్రాధాన్యం

● రైల్వే ప్రజా సంబంధాల అధికారి వినయ్‌కాంత్



గుంటూరు-దొనకొండ సెక్షన్‌లోని రైల్వే ఉద్యోగులకు హెల్త్ ఆన్ వీల్స్ రైలులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుంటూరు డివిజన్ ప్రజా సంబంధాల అధికారి డీ వినయ్‌కాంత్ అన్నారు. శనివారం గుంటూరు-దొనకొండ సెక్షన్‌లో రైల్వే ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు హెల్త్ ఆన్ వీల్స్ రైలుని నడిపారు. మార్గమధ్యలోని అన్ని స్టేషన్లలో ఈ రైలుని నిలిపి అక్కడి సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. మొత్తం 140 మంది రైల్వే ఉద్యోగులు వారి కుటుంబసభ్యులతో ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. గుండె, కంటి, క్యాన్సర్ తదితర స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ముందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీఎంఎస్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, డీఎంవోలు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

కష్టపడే వారికి టీడీపీ అండగా ఉంటుంది

● డీఎస్ఆర్ సన్మాన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని



డీఎస్ఆర్ దంపతులను సన్మానిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, మాధవి, నసీర్ అహ్మద్, మేయర్ నాని తదితరులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నీతి నిజాయితీలతో కష్టపడే వారిని కూటమి ప్రభుత్వం ఎప్పుడూ గుర్తిస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని అన్నారు. రెరా సభ్యుడిగా నియమితులైన దామచర్ల శ్రీనివాసరావు (డీఎస్ఆర్)కు శనివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ, డీఎస్ఆర్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుంటారని, ఆయన రెరా పదవికి అన్ని విధాలా అర్హులని పేర్కొన్నారు. అనంతరం చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, డీఎస్ఆర్ ఫ్రెండ్స్ సర్కిల్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ, డీఎస్ఆర్ తనకెంతో ఆప్త మిత్రుడని తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, పార్టీలో సుదీర్ఘకాలంగా కష్టపడి పనిచేసిన డీఎస్ఆర్ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ పదవి ఇచ్చిందని అన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, పార్టీలో అందరికీ సుపరిచితుడైన డీఎస్ఆర్ సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, రెరా సభ్యుడిగా డీఎస్ఆర్ ఆ పదవికి వన్నెతెస్తారన్నారు. నగర మేయర్ కోవెలముడి రవీంద్ర మాట్లాడుతూ, పట్టుదల, కృషి డీఎస్ఆర్‌కు ఎంతో గుర్తింపు తెచ్చాయన్నారు. పార్టీలో అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతుంటారని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని డీఎస్ఆర్ తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్ఆర్ దంపతులను మెమెంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, రాష్ట్ర టీడీపీ నాయకులు మన్నవ మోహన్ కృష్ణ, డేగల ప్రభాకర్, బుచ్చి రాంప్రసాద్, మల్లే ఈశ్వర రావు, ఛైర్మన్ శివారెడ్డి, సభ్యులు వెంకటరత్నం, కులదీప్, నిమ్మల శేషయ్య, తాళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

● ఏపీ ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ



ప్రతిజ్ఞ చేస్తున్న ఐజీ రవికృష్ణ

గుంటూరు(విద్య),సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ఏపీ ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ విజ్ఞప్తి చేశారు.మాదక ద్రవ్యాలు వాడితే పరోక్షంగా తీవ్రవాదాన్ని ప్రొత్సాహించినట్లేనని ఆయన పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రవికృష్ణ డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న యువత డ్రగ్స్ వలలో చిక్కి జీవితాల్ని, వారి కుటుంబాల్ని నాశనం చేసుకోవద్దని కోరారు. డ్రగ్స్ వాడినా, వాటిని రవాణా చేసినా 5 నుంచి 10 ఏళ్ల పాటు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇలా రాష్ట్రంలో వేల మంది శిక్షలు అనుభవిస్తున్నారని, వీరిలో అత్యధికులు చదుకున్న యువతే కావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని రవికృష్ణ కోరారు. అనంతరం డీఎస్పీ జి.భానోదయ ప్రసంగిస్తూ, కళాశాలల్లో సేఫ్ క్యాంపస్, యాంటి ర్యాగింగ్ క్లబ్‌లకు యాజమాన్యాలు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. యువత ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం, వ్యాయామం, క్రీడలవైపు దృష్టి సారించాలని కోరారు. అనంతరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.జగదీశ్వరి మాట్లాడుతూ, విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్, సైబర్ నేరాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఓ వ్యక్తి మనోభావాలను దెబ్బతీసే ఎటువంటి చర్యలైనా ర్యాగింగ్ కిందకే వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రామనాథం శ్రీనివాసరావు (ఫైల్)

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం గ్రామంలో ఈ నెల 17వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రామనాథం శ్రీనివాసరావు (54) చికిత్స పొందుతూ మృతి చెందారు. సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించటంతో శుక్రవారం గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఆయన బంధువులు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లుకు, శ్రీనివాసరావు అప్పు ఇచ్చారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగటంతో దాసరి వెంకటేశ్వర్లు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించటంతో అతనికి ఏమైనా అవుతుందేమోననే భయంతో శ్రీనివాసరావు గడ్డి మందు తాగారు. ఈ విషయాన్ని భార్యా, పిల్లలకు చెప్పటంతో వారు కూడా మనస్థాపం చెంది.. ఈ నెల 17వ తేదీన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

గుండె పోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి



రామకృష్ణ (ఫైల్)

దాచేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొల్లూరు రామకృష్ణ (61) గుండె పోటుతో మృతి చెందారు. రామకృష్ణ స్వస్థలం తెనాలి. ఆయన అమర్తలూరు మండలం పెరవల్లి హైస్కూల్‌లో పనిచేస్తూ.. ఈ ఏడాది జూన్‌లో బదిలీపై కేసానుపల్లి ఉన్నత పాఠశాలకు హెచ్ఎంగా వచ్చారు. పాఠశాలకు వచ్చిన నాలుగు నెలల్లోనే అందరితో కలివిడిగా ఉంటున్న రామకృష్ణ శుక్రవారం కూడా దాచేపల్లిలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన హఠాత్తుగా మృతి చెందటంతో ఉపాధ్యాయ సంఘ నాయకులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. రామకృష్ణ కుటుంబం తెనాలిలోనే నివాసం ఉంటోంది.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



గాజుల వీరాంజనేయులు (ఫైల్)

దాచేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిరప చేనుకు పురుగుల మందు కొట్టేందుకు వెళ్లిన ఓ వ్యవసాయ కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన దాచేపల్లి మండలం మాదినపాడులో శనివారం జరిగింది. మాదినపాడుకు చెందిన గాజుల వీరాంజనేయులు (37) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం గ్రామంలోని ఓ మిరప చేనుకు పురుగుల మందు కొట్టేందుకు వెళ్లిన అతడు నీరు పట్టుకునేందుకు మోటారు ఆన్ చేస్తుండగా షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.

మాదినపాడు బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

దాచేపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదినపాడు రిజర్వ్ ఫారెస్టు బీట్ ఆఫీసర్ బిళ్ళల వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడింది. మాదినపాడు రిజర్వ్ ఫారెస్టులో జరుగుతున్న అకృత్యాలపై విచారణ జరిపిన మండల అధికారులు జిల్లా అటవీ అధికారులకు నివేదిక అందజేశారు. దీని ఆధారంగా జిల్లా అధికారులు వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఒంటెద్దు వాహనాన్ని ఢీకొన్న బైక్

● ప్రమాదంలో తండ్రీకుమార్తె మృతి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న ఒంటెద్దు వాహనాన్ని బైక్ ఢీకొనడంతో తండ్రీ కుమార్తె మృతి చెందగా, తల్లీ ఆరు నెలల పసికందుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శనివారం భట్టిప్రోలు మండలం కన్నెగంటివారిపాలెం- గొరికపూడి గ్రామాల మధ్యన జరిగింది. రేపల్లె పట్టణానికి చెందిన చొక్కాకుల నాగసాయి (27) మునిసిపాలిటీలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం భార్యా, పిల్లలను తీసుకొని ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఉన్న అత్తగారింటికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో ముందు వెళుతున్న ఒంటెద్దు బండిని అతని ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో నాగసాయి, పెద్ద కుమార్తె పల్లవి (2) అక్కడికక్కడే మృతి చెందగా.. అతని భార్య రాజేశ్వరి, ఆరు నెలల పసికందు వేదశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం రేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివయ్య చెప్పారు. మృతి చెందిన నాగసాయిని, అతని పెద్ద కుమార్తును పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

టెయిల్‌పాండ్ నుంచి 1,97,431 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్రశాల నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 13 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 1,97,431 క్యూసెక్కుల నీటిని శనివారం పులిచింతలకు విడుదల చేశారు. టెయిల్‌పాండ్‌కు ఎగువన ఉన్న సాగర్ నుంచి అదే పరిమాణంలో నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబు తెలిపారు. రిజర్వాయర్‌లో 74.50 మీటర్ల మేర నీరుండగా ఇది 6.0350 టీఎంసీలకు సమానమని చెప్పారు. కాగా, విద్యుత్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు వారు పేర్కొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.43 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, ఎనిమిది గేట్ల ద్వారా 1,89,250 క్యూసెక్కులు, మొత్తం 2,06,520 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఆయన చెప్పారు.

దసరా సెలవులివ్వడంతో

విద్యార్థుల ఇంటిబాట

● బస్టాండు, రైల్వే స్టేషన్లు కిటకిట



ఇంటిబాట పట్టిన విద్యార్థులు....

గుంటూరు, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు ఈ నెల 22 నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. శనివారం మధ్యాహ్నం నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు నగరంలోని హాస్టల్స్ వద్దకు చేరుకుని విద్యార్థుల్ని ఇళ్లకు తీసుకెళ్లే పనిలో పడ్డారు. దీంతో నగరంలోని



ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండులో విద్యార్థుల కోలాహలం

బస్టాండు, రైల్వేస్టేషన్ విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఆటోలు, సిటీబస్సుల్లో సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా ఇంటిబాట పట్టారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు : డీపీటీవో విమల



గుంటూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రయాణీ కుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సీహెచ్ విమల తెలిపారు. దసరాకు ప్రధానంగా జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం గుంటూరు నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు సర్వీసులు నడుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ముందుగా గుంటూరు నుంచి ఈ నెల 30, అక్టోబరు 1, 2వ తేదీల్లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు సర్వీసులు పంపుతున్నట్లు పేర్కొన్నారు. కాగా హైదరాబాద్‌కు 30న హైదరాబాద్‌కు మూడు, చెన్నైకు 2 సర్వీసులు, అక్టోబరు 1న 8, బెంగళూరుకు 3 సర్వీసులు పంపుతామన్నారు. పండుగ ముగిశాక తిరుగు ప్రయాణికుల కోసం రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పరిధిలోని గుంటూరు-1, 2, మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి అదనపు సర్వీసులు అందుబాటులో ఉంచుతామన్నారు.

గురజాల స్త్రీ శక్తి కార్యక్రమం మహా అద్భుతం

● మంత్రి నారా లోకేశ్ ● యరపతినేని నిఖిల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



మంత్రి లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యరపతినేని నిఖిల్

గుంటూరు సిటీ, పిడుగురాళ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కొత్త చర్చకు తెర తీసిన గురజాల స్త్రీ శక్తి కార్యక్రమం మహా అద్భుతమని మంత్రి నారా లోకేశ్ కితాబిచ్చారు. ఒకేసారి 30 వేల మందికి పైగా మహిళామణులను కార్యక్రమంలో పాల్గొనేలా చేయడం గొప్ప సంగతని అభిప్రాయపడ్డారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చిన్న కుమారుడు నిఖిల్ తన పుట్టినరోజు సందర్భంగా మంగళగిరి కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గంలోని పిడు గురాళ్లలో జరిగిన స్త్రీ శక్తి కార్యక్రమాన్ని మంత్రి లోకేశ్ ప్రస్తావించి ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నిఖిల్ మంత్రి లోకేశ్‌కు వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి కూడా తెలిపారు. అన్నింటినీ ఆసక్తిగా విన్న లోకేశ్ మంచి భవిష్యత్తు ఉందంటూ నిఖిల్‌ను కొనియాడారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని మార్గ నిర్దేశం చేశారు. పుట్టినరోజు సందర్భంగా నిఖిల్‌కు మంత్రి స్వీట్స్ తినిపించారు. యరపతినేని నిఖిల్ మంత్రి లోకేశ్‌కు జ్ఞాపికను అందజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర


● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

నేడే చూడండి



నాజ్ అప్సర	- గుంటూరు
హరిహరమహల్	- గుంటూరు
మైత్రి ఫోనిక్స్ మాల్	- గుంటూరు
గోరంట్ల సినిమాస్	- ఒంగోలు
సంఘమేశ్వర	- తెనాలి
లక్ష్మీనరసింహ డీలక్స్	- నరసరావుపేట
మినీ వీఎస్ఎస్	- అద్దంకి
ఊర్వశి	- మంగళగిరి
రాజ్యలక్ష్మి	- రేపల్లె
అప్సర	- టంగుటూరు
కీర్తి	- వినుకొండ
కృష్ణ మహల్	- చిలకలూరిపేట

ఈ-శ్రమ్ పోర్టల్ ప్రారంభం

సత్తెనపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక ఆర్థికభద్రత కల్పించేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందని ప్రాథమిక సంక్షేమశాఖ అధికారి అన్నపూర్ణమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాల నుంచి 59 లోపు వయస్సు ఉన్న కార్మికులంతా ఈ శ్రమ్ కింద లబ్ధి పొందేందుకు అర్హులన్నారు. వివరాలకు 94925 55155 నెంబరుకు సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

సత్తెనపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పేద విద్యార్థి మహేశ్వరికి శనివారం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ రూ.10వేలు ఫీజు చెల్లించారు. నూరుల్లా, సంపత్ పాల్గొన్నారు.

60 మంది ఉపాధ్యాయులకు సభ్యత్వం

రెంటచింతల,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోనే 13 సార్లు డీఎస్సీలు నిర్వహించి లక్షలాది టీచర్ పోస్టులను భర్తీ చేశారని.. అలాగే టీచర్ల బదిలీలను పారదర్శకంగా నిర్వహించి టీచర్ల గౌరవాన్ని ఇనుమడింపజేశారని తెలుగునాడు టీచర్స్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.రాంబాబు అన్నారు. శనివారం 60 మంది టీచర్లకు యనియన్‌లో సభ్యత్వం కల్పించినట్లు పేర్కొన్నారు.

తల్లి ఆరోగ్యంతోనే కుటుంబ క్షేమం

రాజుపాలెం,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా క్షేమంగా ఉన్నట్లేనని తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు అన్నారు. శనివారం బలిజేపల్లి గ్రామంలో రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు రవి పాల్ మొత్తం 139 మంది మహిళలకు బీపీ, షుగర్, రక్తపరీక్షలు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

చినకొదమగుండ్లలో స్వస్థ నారీ సశక్త్ పరివార్

కారంపూడి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొదమగుండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విజయ నాయక్, లక్ష్మారెడ్డి స్వస్థ నారీ సశక్త్ పరివార్ వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. 98 మందికి రక్తపోటు, మధుమేహం, దంత పరీక్షలు జరిపి మందులు అందజేశారు. సర్పంచ్ మల్లికార్జునరావు, సిబ్బంది లక్ష్మారెడ్డి, హెల్త్ ఆఫీసర్ రసూల్, పీహెచ్ఎన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

300 మందికి అన్నదానం

కారంపూడి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో గాంధీ బొమ్మ సెంటర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటి సభ్యులు 300 మందికి అన్నదానం నిర్వహించారు. బండారుపల్లి మురళీకృష్ణ, ప్రసన్న దంపతులు, ఆకాంక్ష ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించారు. నాయుడు వెంకాయమ్మ, బేబి అన్న ప్రసాద పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, చిన్ని లక్ష్మి, మాడిశెట్టి పుష్పలత, చింతల శారద తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి

నకరికల్లు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలు ఆదాయం మార్గాలను పెంచు కోవాలని ఎంపీడీవో కె.సురేష్ అన్నారు. సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు, పంచాయతీల ఆదాయ వనరులను పొందే మార్గం పై శిక్షణ రెండవ రోజు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు, పీవోటీలు పాలపర్తి వసుంధర, మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బలమైన ఆహారంతో.. ఆరోగ్యంగా పిల్లలు

క్రోసూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గర్భిణులు బలమైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వగలుగుతారని క్రోసూరు ప్రాజెక్టు సీడీపీవో వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని 88తాళ్ళూరులో జరిగిన పోషణ మహా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యస్థితిని పరీక్షించుకుంటూ.. సరిపడినంత బరువు పెరిగేలా ఆహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని తెలిపారు. సర్పంచ్ తలతోటి ఏసమ్మ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

● ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అక్టోబరు 2 వరకు జరగనున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ షాద్, డాక్టర్ గఫ్రూన్ మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య అధికారి బాల అంకమ్మబాయి, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్, సూపర్‌వైజర్ శివుడు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో స్వచ్ఛాంధ్ర

సత్తెనపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. పారిశుధ్య కార్మికులతో కలసి వార్డులో చెత్తను ఎమ్మెల్యే కన్నా ఊడ్చారు. ఎలినేడి రామ స్వామి, కంభంపాటి అబ్రహం, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, ఎలినేడి లక్ష్మీతులసి, బండారు నాగరాజు, నూర్ బాషాజానీబాబు, బత్తుల ఆదినారాయణ, పూజల వెంకట కోటయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లేమల్లె పాఠశాలలో 'స్వచ్ఛాంధ్ర'

అమరావతి: మండలంలోని లేమల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ టి.పార్వతి, సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ, పంచాయితీ కార్యదర్శి బి.రమేష్‌బాబు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొని చెత్తను శుభ్రంచేసి, మొక్కలు నాటారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

రాజుపాలెం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని పలువురు పేర్కొన్నారు. రాజుపాలెంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషిచేయాలన్నారు.

● మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని గ్రామ సచివాలయాల్లోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రాధాన్యత గురించి వివరించారు. ప్లాస్టిక్ అనర్థాలను ఎంపీడీవో విష్ణు చిరంజీవి వివరించారు.

మొక్కలు నాటిన అధికారులు

అచ్చంపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీవో కె.శ్రీనివాసరావుతో పాటు ప్రజా ప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, భాష్యం ప్రసాదు, జగదీష్, కోటయ్య, సాంబశివుడు, జానీ, కోటేశ్వరరావు, ఆంజనేయులు, శంకరరావు, చంటి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సత్తెనపల్లి: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పరిశుభ్రతతో ఆరోగ్యానికి మేలు

● 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'లో ఎమ్మెల్యే యరపతినేని



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, అధికారులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పర్యావరణం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పిడుగురాళ్ల పట్టణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం అన్ని చోట్ల జరుపడం ద్వారా పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. మొక్కలు నాటి పచ్చదనం పెంచడంతో పాటు పర్యావరణాన్ని కాపాడితే కాలుష్యాన్ని తగ్గించి మనిషి జీవనశైలి మెరుగుపడుతుందన్నారు. అనంతరం పోలీసు క్వార్టర్స్ వద్ద గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద డివైడర్‌పై ఎమ్మెల్యే మొక్కలు నాటారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని పాల్గొన్నారు. పార్టీ పరిశీలకులు కళ్లం రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, ఎల్‌వీఆర్, సురేష్, శ్రీను, బి.శ్రీను, బాబావలి, వెంకటేశ్వర్లు, అమీర్‌అలి, సైదా, రమేష్, ఖాశింసైదా, రామచంద్రరావు, సాంబయ్య, కిరణ్, రమేష్, నెహ్రూ, హనుమంతరావు, సుబ్బయ్య, ఆంజనేయులు, వెంకటనాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం పలికారు. సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్‌లో సీఎం దిగగానే పార్టీ శ్రేణులు, ప్రభుత్వ అధికారులు భారీ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, పురపాలక శాఖ మంత్రి నారాయణలు చంద్రబాబునాయుడుకి జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు. స్వచ్ఛభారత్ కార్పోరేషన్ చైర్మన్ పట్టాభి, శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాళ్లపాటి శ్రీధర్, చిరుమామిళ్ల మధుబాబు, రిటైర్డ్ ఐజీ చిరుమామిళ్ల వెంకటనరసయ్య, జిల్లా కలెక్టర్ కృత్తికాశుక్లా, ఎస్పీ కృష్ణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యేలూరి శశిబాబు, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, జనసేన నేత పులి హరి, వజ్రం నాయక్, దుర్గారావు, యాగంటి మల్లికార్జునరావు, పుంగులూరి పుల్లయ్య ఘన స్వాగతం పలికారు. స్కూల్ విద్యార్థినులు సీఎం చంద్రబాబునాయుడితో కరచాలనం చేసి ఘన స్వాగతం పలికారు. టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి బైక ర్యాలీతో సభా ప్రాంగణానికి చేరుకున్నారు.



చంద్రబాబుకు జ్ఞాపికతో జూలకంటి స్వాగతం..

సీఎం సభకు భారీగా తరలిన తమ్ముళ్లు

రెంటచింతల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం హోదాలో తొలిసారిగా మాచర్ల వచ్చిన చంద్రబాబునాయుడి సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు శనివారం భారీగా తరలి వెళ్లారు. హెలిప్యాడ్ సమీపంలోమండలానికి చెందిన పలువురు నేతలు చంద్రబాబుతో కరచాలనం చేశారు. 2022 జనవరి 14న హత్యకుగురైన చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన చంద్రబాబు రెంటచింతలలో తన కాన్వాయ్‌ను (వాహన శ్రేణి) స్లో చేశారని అప్పుడు ఇప్పుడు బాబును దగ్గరనుంచి చూశామని టీడీపీ నేతలు పేర్కొన్నారు.



కేశవరెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న బైకు ర్యాలీ

ఘనంగా యరపతినేని నిఖిల్ జన్మదిన వేడుకలు

గురజాలటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ జన్మదిన వేడుకలను శనివారం టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో టీడీపీ యువనేత యేచూరి సతీష్ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం జరిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. చర్లగుడిపాడు గ్రామానికి చెందిన కావూరి రామారావు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, గడిపూడి చెన్నయ్య, ఆకుల పిచ్చయ్యగుప్తా, అడపా శ్రీనివాసరావు, నేలవల్లి బొల్లయ్య, పోటు నాగేశ్వరరావు, నవులూరి శ్రీరామ్మూర్తి, చాగంటి శ్రీను, శరమాల హనుమంతురావు, ముత్తన నీలకంఠారెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, జంపని లింగారావు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల: కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



గురజాల: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

టీడీపీ యూత్ సేవా కార్యక్రమాలు

దాచేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ యూత్ నాయకులు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పరీక్ష అట్టలు, పండ్లు, జామెంటరీ బాక్సులను మండలంలోని కేసానుపల్లి ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పంపిణీచేశారు. నాయకులు నెల్లూరి రామకోటయ్య ఆధ్వర్యంలో సుమారు రూ.50వేల విలువ గల విద్యా సామగ్రి అందజేశారు. రామాపురంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వేములు వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో శి వాలయంలో పూజలు, జన్మదిన కేక్‌లను కట్ చేశా రు. పాఠశాల విద్యార్థులకు కేక్‌లు, స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో నెల్లూరి రామకోటయ్య, కోట శాయన్న, నెల్లూరి హనుమంతరావు, నెల్లూరి కోటయ్య, షేక్ జానయ్య, తోట నాగేశ్వరరావు, కోట మధు తదితరులు ఉన్నారు. నిఖిల్ జన్మదినవేడుకలు టీడీపీ మండల కన్వీనర్ బొమ్మారెడ్డి నారాయణ, పట్టణ అధ్యక్షుడు అహ్మద్ షరీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నర్ర పుల్లయ్య, నారాయణ, ఎం నిమ్మయ్య, కొప్పల గిరి, పి భాష్కరరావు, అంబటి మల్లి, కె.నాగేశ్వరరావు, కూరాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యువతకు నిఖిల్ ఆదర్శం..

పిడుగురాళ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యువ నాయకుడు యరపతినేని నిఖిల్ పుట్టినరోజును పురస్కరించుకొని పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో నేతలు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరై కేక కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిఖిల్ ఆదర్శంగా నిలుస్తున్నాడని మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, పార్టీ నేతలు పేర్కొన్నారు. కార్యకర్తలకు వెన్నంటి భరోసాగా తండ్రికి తగిన తనయుడుగా నిఖిల్ ఉండడం నేటి రాజకీయాలకు ఎంతో అవసరమని నియోజకవర్గ పరిశీలకులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను తెలిపారు. జూలకంటి సుబ్రహ్మణ్యం, కట్టమూరి శంకరరావు, యేలూరి చంద్రశేఖర్, కోట హరినారాయణ, చల్లగుండ్ల వెంకటరావు, వర్ల రత్నం, మందా డేవిడ్, మద్దినేని సైదమ్మ, పసుమర్తి సుబ్రహ్మణ్యం, ముప్పన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరు, కోగంటివారిపాలెంలో పోషణ మాసోత్సవం

అచ్చంపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు, ఆర్‌కేజీపాలెం గ్రామాల్లో శనివారం 8వ రాష్ట్రీయ పోషకాహార మాసోత్సవం జరిగింది. పిల్లలకు, తల్లులకు అపార ఐడీ గురించి వివరించారు. వేల్పూరులో సూపర్‌వైజర్ కె.పద్మ, కేవీపాలెంలో సూపర్‌వైజర్ మాణిక్యంతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు అంజమ్మ, ఇందిరాగాంధీ, శ్యామలాదేవి, శకుంతల, శివకుమారి పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు

అచ్చంపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా వైస్ గవర్నర్ సూరె వెంకట కోటిలింగం శనివారం తెలిపారు. గోల్డెన్ బర్డ్స్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నలు, కుటుంబ సురక్షా పథకం కింద చెక్కులు, అచ్చంపేటలోని శివాలయంలోని గోశాలకు తవుడు బస్తాల పంపిణీ చేసినట్లు వెల్లడించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ప్రేరణ తరగతులు నిర్వహించి, నీలేశ్వరపాలెం నీలకంఠేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా గవర్నర్ చిరంజీవి, రమేష్, వెల్లంపల్లి కేశవరావు, రీజియన్ చైర్మన్ అనుమోలు శేసగిరిరావు, గ్రంధి రాము, బీ రవి కుమార్ పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాల్లో బీజేపీ నేతలు

అచ్చంపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి, కోగంటివారిపాలెం గ్రామాల్లో సేవా పక్షోత్సవాల సందర్భంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పడకండ్ల లక్ష్మణాచారి శనివారం తెలిపారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులుఉ పంపిణీ చేసినట్లు తెలిపారు.

రాజుపాలెంలో రక్తదాన శిబిరం

రాజుపాలెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో... రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. యువకులు రక్తదానం చేశారు. తహసీల్దారు సరోజ, డిప్యూటీ తహసీల్దారు జానీ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క రోజులో ఎంత మార్పో..!

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, సర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాచర్లలో స్థానిక యాదవబజారు వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి సీఎం చంద్రబాబునాయుడు చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రానికి కార్మికులు చెత్త అంతా తొలగించి శుభ్రపరిచారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటి కూర్చునేందుకు సిమెంట్ బల్లాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహించిన పారిశుధ్య కార్మికులను సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు.



సీఎం చంద్రబాబు పర్యటనకు ముందు అపరిశుభ్రంగా ఉన్న యాదవ బజారు



సీఎం చంద్రబాబు పర్యటన అనంతరం శుభ్రమైన యాదవ బజారు

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం

పెదకూరపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం సమాజిక బాధ్యత అని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ అంద్ర ప్రసాదు అన్నారు. పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విద్య మాట్లాడుతూ తలసేమియా రోగులతో పాటు ప్రమాదాల్లో తీవ్రంగా గాయ పడిన వారి రక్తం అదుబాటులో లేక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సర్పంచ్ గుడిపూడి రాజు, బాష్యం ఆంజనేయులు, చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, మండల టీడీపీ నేతలు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత చేసి మొక్కలు నాటారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

సత్తెనపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం కేంద్రీయవిద్యాలయంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రిన్సిపల్ జగదీష్ కుమార్ గుప్తా, తహసీల్దార్ చక్రవర్తి శనివారం ప్రారంభించారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ చక్రవర్తి అన్నారు. పాఠశాల నిర్వహణ సంఘ సమావేశాన్ని నిర్వహించారు.

దేశం గర్వించదగ్గ నటుడు అక్కినేని

క్రోసూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతిని శనివారం ఘంటసాల కళా సమితి ఆధ్వర్యంలో క్రోసూరులో నిర్వహించారు. సేవా సమితి నాయకులు అక్కినేని చిత్రపటానికి పూల దండలు వేసి నివాలులర్పించారు. సమితి అధ్యక్షుడు శిఖా శ్యామ్‌సన్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నటుడు అక్కినేని.. వందలాది చిత్రాల్లో నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. కళా సమితి నాయకులు షేక్ మస్తాన్, కూనల నాగరాజు, షేక్ జానీ బాషా పాల్గొన్నారు.

అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమితి నాయకులు



చంద్రమౌళేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం

నకరికల్లు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకొని శనివారం నరసింగపాడులోని గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి రుద్రహోమం, చండీ హోమం నిర్వహించారు. చంద్రమౌళేశ్వర స్వామిని, గంగా అన్నపూర్ణాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పమిడిమర్రి శ్రీనివాసరావు నిర్వహించారు. చేజర్లలోని కపోతేశ్వర స్వామి, గుండ్లపల్లిలోని మల్లేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో నరసింగపాడులో గంగా అన్నపూర్ణాదేవి

ముందస్తు బతుకమ్మ పండుగ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుమ్మలచెరువు సమీపంలోని బోధి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు శనివారం నిర్వహించారు. బతుకమ్మ తయారీ, పూజా విధానం గురించి పాఠశాల కరస్పాండెంట్ సునీతా రెడ్డి విద్యార్థులకు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

పెదకూరపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 75 తాళ్ళూరులో కాశీ అన్నపూర్ణేశ్వర స్వామి దేవస్థానం అయోధ్య స్వామి ఆశ్రమంలో శనివారం మాస శివరాత్రిని పురస్కరించుకొని మహన్యాస రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వేద పండితులు ఆదిత్య శర్మ, హనుమంతరావు శర్మ, హరినాథ్ శర్మ పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలను నిర్వహించారు. ముత్తైదువులకు పసుపు కుంకుమ పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



తిరుపతిలోని ఎయిర్‌పోర్టు లాంజ్‌లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో పలమనేరు, ఆముదాలవలస, పెదకూరపాడు ఎమ్మెల్యేలు అమరనాథ్‌రెడ్డి, కూన రవికుమార్, భాష్య ప్రవీణ్ - పెదకూరపాడు

ఎమ్మెల్యే భాష్యం సంతాపం

క్రోసూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రోసూరుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బండారు వెంకటరావు శనివారం మృతి చెందగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వెంకటరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు, కాంద్రు కాశయ్య, డాక్టర్ మహమ్మద్ షరీఫ్, జిల్లా టీడీపీ నాయకుడు సాయిబాబు, రాణి, మండల టీడీపీ అధ్యక్షుడు జాన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ యోహాన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సదాశివరావు, వెంకట రామిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

సొంత ఆదాయ వనరులపై దృష్టి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సొంత ఆదాయ వనరులు పెంచుకోవడంపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌డీవో రాజగోపాల్ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సొంత ఆదాయ వనరుల రూప కల్పన పై రెండు రోజులు శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీలు అధిక రాబడి కలిగి ఉన్నప్పుడే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన జరిగి అవి అభివృద్ధిలో పయనిస్తాయన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో టీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ విజయ సుందర్ దాసు, ఎంటీవి.శ్యామ్, టీవోటీలుగా షేక్ ఖాదర్ బాషా, ఏ ఉమా శంకర్ వ్యవహరించారు.

అనసూయమ్మకు యరపతినేని పరామర్శ

దాచేపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకురాలు బెల్లంకొండ అనసూయమ్మను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరామర్శించారు. దాచేపల్లిలోని నివాసంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న అనసూయమ్మను శనివారం కలిసి పరామర్శించారు. అనసూయమ్మ కుమారుడు బెల్లంకొండ భారతి బద్రి నడికూడి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

సకాలంలో రైతులందరికీ యూరియా సరఫరా

బెల్లంకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సకాలంలో రైతులందరికీ యూరియా సరఫరా చేస్తున్నట్లు బెల్లంకొండ మండల వ్యవసాయ శాఖ అధికారిణి అమల కుమారి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో రైతులందరికీ ఎరువుల సరఫరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల కొరత లేదని, ప్రతి ఒక్క రైతుకు సకాలంలో ఎరువులను అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ మేళం శ్రీరామమూర్తి, మేళం యలమంద, మేళం కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు...

పిడుగురాళ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల జీడీసీసీ ఎంఎస్ గోదాము, మన గ్రోమోర్ సెంటర్, పాతగణేశునిపాడు, తుమ్మలచెరువు రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని ఏవో సంధ్యారాణి తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంట విస్తీర్ణం ఆధారంగా ఎరువులను పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

బెల్లంకొండలో భారీ వర్షం

బెల్లంకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బెల్లకొండలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారి జలమయ మైంది. బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో డ్రెయినేజ్ వ్యవస్థ సక్రమంగా లేక పోవటంతో వర్షపు నీరంతా రోడ్డు పై నిలబడుతుంది. భారీ వర్షంతో బెల్లంకొండ జెడ్పీ పాఠశాల మైదానం, తహసీల్దార్ కార్యాలయ ఆవరణ వర్షపు నీటితో నిండిపోయింది. డ్రెయినేజ్ వ్యవస్థ సక్రమంగా లేక పోవటం వల్ల వర్షపు నీరంతా ఎస్సీ కాలనీలోకి చేరుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

నకరికల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు అన్నారు. నకరికల్లులో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు.



మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలి

సీఎంకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వినతి

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. శనివారం మాచర్లలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సభలో ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. గోదావరి నీటిని సాగర్ కుడి కాల్వకు కలపడం ద్వారా మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని అనేక గ్రామాలకు తాగునీటిని స్థిరీకరించవచ్చన్నారు. నవంబరు, డిసెంబరు నాటికే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఆరు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సూపర్ సిక్స్ సూపర్‌హిట్

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సూపర్ సిక్స్‌ను అమలు చేస్తూ సీఎం సూపర్‌హిట్ చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 75 ఏళ్ల వయసులో కూడా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి కష్టపడుతున్నారన్నారు. పది లక్షల కోట్ల అప్పు ఉన్నా ఏమాత్రం భయపడలేదన్నారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రూ.పది లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. బనకచర్ల ద్వారా రాయలసీమకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. మోసానికి, అరాచకానికి, విధ్వంసానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని తెలిపారు. మాచర్లను ఆదుకోవాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

టీడీపీకి కార్యకర్తలే బలం

- వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- కూల్‌గా శ్రీకృష్ణదేవరాయలు.. ఫైర్‌బ్రాండ్‌గా బ్రహ్మారెడ్డి
- కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మాచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం అని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మాచర్లలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగం గా టీడీపీ కార్యకర్తలతో చంద్రబాబు సమావేశమై ప్రసంగించారు. మాచర్లలో ఇరవై సంవత్సరాలు కష్టపడ్డారని, సరైన నాయకత్వ లేకపోవడంతో నష్టపోయామని, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు. సరైన సమయంలో మాచర్ల, పులివెందులలో దుర్మార్గాలను అడ్డుకోగలిగామన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూల్‌గా పనిచేసుకుని వెళ్తుండగా, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి అందుకు భిన్నంగా ఫైర్‌బ్రాండ్‌గా ఉంటూ కార్యకర్తలను కాపాడుకోవడంలో ముందున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో చంద్రయ్య, జల్లయ్యలను నష్టపోతే వారి కుటుంబాలకు నష్ట పరిహారం కూడా అందించామన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి పార్టీకి సేవలందించాలని కోరారు. ఎక్కడో



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మహిళలు

రాజీవ్‌గాంధీ చనిపోతే మాచర్లను తగలబెట్టారని, ఆ తదుపరి 20 ఏళ్లు వారి ఇష్టారాజ్యంగా యేలారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని జూలకంటిని ఈ ఎన్నికల్లో అభ్యర్థిగా దించామన్నారు. రౌడీయిజాన్ని తట్టుకుంటే మాచర్ల ఎల్లప్పుడూ టీడీపీదేనని అన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాచర్లలోని యాదవులబజారులో పారిశుధ్య కార్మికులతో కలిసి చీపురు పట్టి రోడ్డు ఊడ్చారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రత లేకపోతే వ్యాధులు ప్రబలి, అనారోగ్యాలకు గురై ఆర్థికంగా నష్టపోతారని వివరించారు. పారిశుధ్య కార్మికులు కూడా పని ప్రదేశాల్లో చేతులకు గ్లౌజులు ఉపయోగించాలన్నారు. పారిశుధ్య కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం సాగర్‌రోడ్డులోని ఆర్టీసీ గ్యారేజీ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛరథాలను ప్రారంభించారు. స్వచ్ఛరథంలో అందించే సేవల గురించి వైద్యులతో చంద్రబాబు చర్చించారు.



డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కలెక్టర్ కృతికాశుక్లా



యాదవ బజారులో స్థానికులతో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

మోడల్ మున్సిపాలిటీగా మాచర్ల

మాచర్ల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. మాచర్లను ఆదర్శ మునిసి పాల్టీగా తీర్చిదిద్దు తామని, రూ 50 కోట్లు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లాతో పాటు మాచర్ల తలసరి ఆదాయం తక్కువగా ఉందని చెప్పారు. అన్ని ప్రాంతాలతో సమానంగా తలసరి ఆదాయం పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తామని సీఎం ప్రకటించారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా మూడేళ్లలో ప్రతి ఇంటికి నీళ్లు ఇస్తామని, అమృత్ పథకంలో భాగంగా మాచర్ల తాగు నీటి పథకం విస్తరించి నీరందివడం జరుగు తుందన్నారు. పల్నాడు జీవనాడి వరికపూడిశెల సఫలీకృతం చేసే బాధ్యత తాను తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు. దీని ద్వారా 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్న సీఎం.. లక్షమందికి తాగు నీరు అందించే అవకాశం ఉందన్నారు. మొదటి దశలో 1.25 టీఎంసీలు, రెండవ దశలో 6.5 టీఎంసీలు నీరు అందింజేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుం దన్నారు. పక్కనే నాగార్జున సాగర్ ఉన్నా.. మాచర్లకు నీరు లేదని, ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే విధంగా అన్ని నదులను అనుసంధానం చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గోదావరి జలాలను కుడి కాల్వకు తీసుకొస్తా మన్నారు. రైతుల కోరిక మేరకు ఈ ప్రాంతానికి మిరప బోర్డును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మాచర్లలో వంద పడకల ఆస్ప త్రిని కూడా మంజూరు చేస్తానని చంద్రబాబు చెప్పారు. పల్నాటి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహిస్తామని చె ప్పారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు కలెక్టర్‌ను ఆదేశించారు.

మాచర్లకు స్వాతంత్ర్యం వచ్చింది

(5వ పేజీ తరువాయి)

రౌడీయిజం.. నేరాలు ఘోరాలు చేస్తే ఊరుకునేది లేదు. మంచి కార్యక్రమాలు చేసి ప్రజల అభిమానాలు పొందాలి. ప్రజల ఆస్తులకు రక్షణగా నిలబడతాం. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర మంచి కార్యక్రమంలో పాల్గొన్నాను. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలి. ఇక్కడ నేతల మనసుల్లో ఉన్న చెత్తను కడిగేస్తే తప్ప ఈ మాచర్ల బాగుపడదు. గత ప్రభుత్వంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తంతా రోడ్డుపై వేశారు. ఈ చెత్తను క్లీన్ చూసే బాధ్యతను తీసుకున్నాను. చెత్తను క్లీన్ చేసినట్టే చెత్త రాజకీయాలను క్లీన్ చేస్తాను. మాచర్ల ఎన్నికల్లో చశాను. ప్రజాగ్రహం ఎలా ఉంటుందో 33 వేల మెజార్టీతో గెలిపించి చూపించారు. మాచర్ల అనగానే.. రోడ్డుపై అతి కిరాతకంగా కత్తితో జగన్‌కు జై కొట్టాలని బెదిరించినా జై చంద్రబాబు అన్న చంద్రయ్యను హత్య చేశారు. జాలయ్యకు రక్షణ లేకపోతే ఎక్కడకో పోయి తలదాచుకుంటే అతి కిరాతకంగా చంపేశారు. నంబూరు శేషగిరి రావు కూడా వీరోచితంగా పోరాడారు. అలాంటి ప్రజాస్వామ్య వీరులకి శ్రద్ధాంజలి ఘటించి.. చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇస్తున్నాం. ఎవరికి అన్యాయం జరిగినా ఈ ప్రభుత్వం ఉపేక్షించదు. న్యాయం చేసే వరకు అండగా ఉంటాం. ఐదేళ్లు నాలాంటి నాయకుడే మాచర్లకు రాలేకపోయిన పరిస్థితి. నేడు ఏవరైనా మాచర్లకు స్వేచ్ఛగా రాగలుగుతున్నారు. ఆది అప్పటి పరిపాలన, ఇది ఇప్పటి పరిపాలన.' అని సీఎం చంద్రబాబు పరోక్షంగా పిన్నెల్లి సోదరులను చంద్రబాబు హెచ్చరించారు. సభలో రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభి, ప్రభుత్వ కార్యదర్శి సురేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ డి.వేణుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీలావతి

రెండు బంగారు కుటుంబాలు దత్తత

(5వ పేజీ తరువాయి)

రావడం లేదని ఆమె తెలపడంతో..వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు.. వితంతు పింఛన్ అమెకు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

నీలావతి కుటుంబాన్ని పీ4 కింద దత్తత తీసుకొవడానికి కేసీపీ సంస్థ ముందుకొచ్చింది. నీలావతికి తమ సంస్థలో పని కల్పిస్తామని సీనియర్ జనరల్ మేనేజర్ వైకుంఠం వెంకటరమణ వేదికపై ప్రకటించారు. ఆమెతో పాటు 50 మందికి కుట్టు మిషన్లు అంస్తామని తెలిపారు. పిల్లలను ఉన్నత చదువుల బాధ్యతను కేసీపీ తీసుకొవాలని సీఎం కోరడం, వెంటనే అందుకు అంగీకరించడంతో.. కేసీపీ సంస్థను చంద్రబాబు అభినందించారు. సంస్థ ఇంకా ఎన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటుందో తెలపాలని, ఈ విషయంలో నాన్పేద్దని చంద్రబాబు కోరారు. దీంతో మరికొన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటామని మేనేజర్ ప్రకటించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంతోనే సరిపోందని, ఆ కుటుంబాల తలసరి ఆదాయం పెరగాలన్నారు. భవిష్యత్‌లో దీనిని పరిశీలించడం జరగుతుందని చంద్రబాబు చెప్పారు.

కుమార్తె, చెల్లిని చదివించాలి : నజీరున్

మాచర్లకు చెందిన షేక్ నజీరున్‌ను మరో బంగారు కుటుం బంగా ఎంపిక చేశారు. ఈమె తను పడుతున్న కష్టాల ను చంద్రబాబుకు విన్నవించింది. తన భర్త చనిపోయాడని, కు మార్తె ఉందని.. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషి స్తున్నానని పేర్కొంది. తనకు చెల్లి ఉంది. కుమార్తెతో పాటు తన చెల్లిని చదివించే బాధ్యత తనపై ఉందని చెప్పుకొచ్చింది. తల్లి ఇటీవలే మరణించిందని, తండ్రి అనారోగ్యంతో ఉన్నా రని.. కూతురు, చెల్లి ఇద్దరు డిగ్రీ చదువుతున్నారని.. ఇద్దరి చదువుకు సాయం అందించాలని కోరింది. దుర్గికి చెందిన విత్తన కంపెనీ యజమాని యాగంటి వెంకటేశ్వర్లు నజీరున్ బంగారు కుటుంబానికి మార్గదర్శిగా నిలిచారు. ఆ ఇద్దరి చదు వుకు సాయం అందిస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ ఇద్దరు ఎంత వరకు చదువుతారో చదివించి వారిని సెటిల్ చేయాలని చంద్రబాబు సూచించారు. ఈ కుటుంబాన్ని దత్తత తీసుకున్న వెంకటేశ్వర్లును అభినందించా రు.ఆమె తండ్రికి పింఛన్‌కు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.



చంద్రబాబుతో మాట్లాడుతున్న నజీరున్

ఆహ్లాదం.. ఎకో-టూరిజం



ఎకో-టూరిజం ప్రధాన ద్వారం

- సూర్యలంకలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా కాటేజీలు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో ఎకో-టూరిజం కాటేజీలను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. జీడిమామిడి తోటల మధ్య 45 రకాల చెట్లు, మొక్కల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడ ముచ్చటగా ఉన్న కాటేజీలలో సేద తీరేందుకు దూర ప్రాంతాలు నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని పర్యాటకులు వస్తున్నారు. సూర్యలంక నేచర్ క్యాంపు రిసార్ట్స్‌గా ఏర్పాటు చేసిన వీటిలో పర్యాటకుల కోసం బీచ్ సఫారీ, సైకిల్ సఫారీ సదుపాయం కూడా కల్పించారు. కాటేజీల చుట్టూ 45 రకాల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో కూడా చల్లటి వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కాటేజీలలో సరదాగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎకో-టూరిజం కాటేజీలకు ఆ తర్వాత వైసీపీ పాలనలో ఆదరణ కరువైంది. వీటి అభివృద్ధిని వైసీపీ పాలకులు గాలికి వదిలేశారు. మొక్కుబడిగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మరలా దృష్టి సారించింది. ఇక్కడ మొత్తం 6 కాటేజీలు, ఒక డార్మెటరీ, రెస్టారెంట్, వాటర్‌ప్లాంట్ ఉండగా.. ప్రస్తుతం మరో 6 కాటేజీలు అత్యాధునికంగా ఏర్పాటు చేశారు.



నూతనంగా నిర్మించిన కాటేజీలు

కొరవడిన ఆదరణ

సముద్రానికి కొంత దూరంలో ఎకో-టూరిజం కాటేజీలు ఉండటంతో పర్యాటకుల ఆదరణ కరువైంది. సముద్రం ఎదురుగా ఉండే కాటేజీలకే పర్యాటకులు మొగ్గు చూపుతు న్నారు. అయితే ఇక్కడ పచ్చటి మొక్కలు, చెట్లు, ఆహ్లాదాన్ని పంచే విధంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రకృతి మధ్య ఉండాలనుకునే వారు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. సముద్రాన్ని సందర్శించిన తర్వాత ఇక్కడకు వచ్చి మంచి నీటితో స్నానాలు చేసి సేద తీరే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది.





ఎకోటూరిజంలో పర్యాటకులు తిరిగేందుకు ఏర్పాటు చేసిన సైకిళ్ళు

కాటేజీలకు సంబంధించిన ధరలు

సూర్యలంక తీరంలోని ఎకో-టూరిజం కాటేజీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. సోమవారం నుంచి గురువారం వరకు 24 గంటలకు పాత కాటేజీలకు రూ.3,472, కొత్త కాటేజీలకు రూ. 2,912 ధరను నిర్ణయించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు పాత కాటేజీలకు రూ. 3,819, కొత్త కాటేజీలకు రూ. 3,203 ధరను నిర్ణయించారు. డార్మెటరీలో మొత్తం 6 బెడ్‌లు ఉండగా.. దీనికి రూ. 4,816 ధరను నిర్ణయించారు. ఎక్స్‌ట్రా బెడ్‌కు విడిరోజుల్లో రూ.998, వారాంతాల్లో రూ. 1098 ధరను నిర్ణయించారు. ఇక్కడ చిన్నచిన్న ఫంక్షన్‌లకు, ఫొటో షూట్‌లకు అవకాశం కల్పిస్తున్నారు.



ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ఫంక్షన్‌గ్రౌండ్


టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు

ఎకో-టూరిజం కాటేజీలను మరింత అభివృద్ధి చేసేందుకు అనేక ప్రతిపాదనలు చేశారు. ఇక్కడ సేద తీరే పర్యాటకులు సముద్రానికి వెళ్ళేందుకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పిల్లల పార్కు అభివృద్ధి, గ్రీనరీ డెవలప్‌మెంట్, మినీ థియేటర్ సౌకర్యంతోపాటు కాటేజీలు పెంచే ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వం దీనికి సంబంధించి నిధులు మంజూరు చేసిన వెంటనే అన్ని రకాల వసతులతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన కాటేజీలు మరిన్ని అందుబాటులోకి రానున్నాయి.

తెలుగు భాషోద్దీపనం ద్వారానే సాంస్కృతిక వికాసం

- లఘు చిత్రాల ప్రదర్శన సభలో వక్తలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భాషను, సాహిత్యాన్ని, కళలను, ఆచారాలను గౌరవించడం ద్వారానే తెలుగు వికాసాన్ని, సంస్కృతిని రక్షించవచ్చని 2026 ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు భారతీయ విద్యాభవన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో శనివారం ఆంధ్రా సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 2026లో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన లఘు చిత్రాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి పంతులుపై కొత్తపల్లి సీతారాం నిర్మించి దర్శకత్వం వహించి కృత్రిమ మేధస్సుతో రూపొందించిన "తెలుగు వెలుగు గొడుగు గిడుగు" లఘు చిత్రం విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఎన్టీఆర్ తన చిత్రాల ద్వారా భాషా ఉన్నతికి కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో పయనించాలని కోరారు. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానమని అన్నారు. గ్రాంథిక భాష నుంచి వ్యవహారిక భాష ప్రాధాన్యాన్ని గుర్తించి దాని అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ, ప్రత్యేక మంత్రిత్వశాఖ ద్వారా తెలుగు భాషా వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ, వేమన, సుమతీ శతకాల ద్వారా తెలుగు భాషా మాధుర్యాన్ని రుచి చూడవచ్చని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు చరిత్రలో చిరస్థాయిగా మిగిలేలా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్, బ్రాహ్మణ పరిషత్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్, సినీ ప్రముఖులు దశరథ్, కోన వెంకట్, డీవై చౌదరి, బీవీఎస్ రవి, సిరాశ్రీ, సమన్వయకర్త పీ.రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.



లఘు చిత్రాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గజల్ శ్రీనివాస్, పొడపాటి తేజస్విని, సినీ ప్రముఖులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

హరితాంధ్రప్రదేశ్ సాధన దిశగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా కూటమి ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, చైతన్య లిటిల్ స్కూల్స్ సంయుక్తంగా యడ్లపాడు మండలం దింతెనపాడు గ్రామంలో శనివారం విత్తన బంతులు వెదజల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి గ్రామపరిధిలో 26 ఎకరాల్లో విస్తరించిన బొద్ధ చెరువు గట్లపై, పరిసరాల్లో విత్తన బంతులను వెదజల్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత ప్రజల జీవితాల్లో ఒక భాగం కావాలన్నారు. రాష్ట్రంలో కోటి మొక్కలు నాటాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యానికి అనుగుణంగా కూటమి స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. విత్తన బంతులు చల్లి 25 వేల మొక్కలను నాటాలని తీసుకున్న రోటరీక్లబ్, చైతన్య లిటిల్ స్కూల్ నిర్వాహకుల నిర్ణయాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చెట్ల వల్ల కలిగే లాభాలు, వాటిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతలపై చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. రోటరీ క్లబ్ సభ్యులు, చైతన్య లిటిల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



దింతెనపాడు బొద్ధ చెరువు గట్లపై విత్తన బంతులను విసురుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

దింతెనపాడులో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

యడ్లపాడు మండలంలోని దింతెనపాడు గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్, రూ.14లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధానంగా గ్రామంలోని బీసీ కాలనీలో సీసీరోడ్డు, పంచాయతీ భవనం, శ్మశాన వాటిక నిర్మాణం చేయించాలని కోరారు. అంతేగాకుండా గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ భవన నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. అంతేగాకుండా ఆర్టీసీ డిపో మేనేజరుతో ఫోన్‌లో మాట్లాడి గ్రామానికి బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, వీఆర్వోపై రైతులు, గ్రామస్థులు పనులు చేయడం లేదని, ఏదో ఒక వంకతో కాలయాపన చేస్తూ వేధిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా తమ గ్రామానికి వీఆర్వో ఎవరో కూడా తెలియదని చెప్పారు. దీనితో ఎమ్మెల్యే తహసీల్దార్‌ను పిలిచి జాప్యం లేకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవరపు చౌదరి, పోపూరి హనుమంతరావు, అత్తోట శ్రీను, కందిమళ్ళ రఘురామారావు, పోపూరి వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ కరీముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటి, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథులు, కళాశాల యాజమాన్యం తదితరులు

ఈశ్వర్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి ప్రారంభ జీవితం ఎంతో గొప్పదని, బాగా కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలన్నారు. మరో ముఖ్యఅతిథి డాక్టర్ ఆర్.వినోద్‌కుమార్ మాట్లాడుతూ గొప్ప వ్యక్తులు ఎక్కడ నుంచో తయారుకారని, కళాశాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగించుకొని తమని తామే గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అల్యూమిని విద్యార్థి జీ.భవానిశంకర్ మాట్లాడుతూ అవకాశాల కోసం ఎదురు చూడకుండా మనమే అవకాశాల్ని సృష్టించుకోవాలన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, చెస్, టెన్నికాయిట్ పోటీల్లో విజేతలకు పతకాలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు, కళాశాల చైర్మన్ షేక మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ షేక్ నజీమా, వ్యాయామ అధ్యాపకుడు హెచ్ గంగాధర్, వ్యాయామ సహాయకుడు డీ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ తైక్వాండోలో ఎస్ఎస్ఎన్ విద్యార్థి ప్రతిభ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14న జరిగిన ఫస్ట్ ఏషియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025లో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్ శనివారం తెలిపారు. ఎస్ఎస్ఎన్ విద్యార్థి ముప్పాళ్ళ శివసాయి శ్రీకర్ జూనియర్ బాయ్స్ విభాగంలో అండర్ 73 కేజీల బరువు క్యాటగిరిలో క్యోరుగి ఈవెంట్‌లో బంగారు పతకం, పూంసే ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించాడన్నారు. శివసాయిశ్రీకర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ పీ.శ్రీనివాససాయి, పీడీ మధుసూదనరావు, విద్యార్థి తల్లిదండ్రులు ఎం.కాంచన, ఎం.రవిశంకర్ అభినందించారు.



శివసాయిశ్రీకర్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ సందర్శన



టెయిల్ పాండ్ డ్యామ్ వద్ద జేఎన్‌టీయూ నరసరావుపేట విద్యార్థులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ నరసరావుపేట విద్యార్థులు రెంటచింతల మండలం సత్రశాలలో ఉన్న ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ డ్యామ్‌ను శనివారం సందర్శించారు. మెకానికల్ బ్రాంచ్‌కు చెందిన 55 మంది విద్యార్థులు అకడమిక్ క్యాలెండర్‌లో భాగంగా ఉండే పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ సంబంధించి ప్రాక్టికల్ అవగాహన కోసం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలోచనతో పాటు పారిశ్రామిక స్థాయిలో అనుభవం పొందే అవకాశం కలగడం ఎంతో ఉపయోగకరమన్నారు. హైడ్రాలిక్ పవర్ జనరేషన్‌లో వినియోగించే ఆధునిక టెక్నాలజీని ప్రత్యక్షంగా చూడటం వల్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలుగుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వైఎస్ కిషోర్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి ఐఎస్ ఫణి సుష్మ, అధ్యాపకులు సులోచన, ఎం.బాలాజీనాయక్ విద్యా పర్యటనకు ప్రోత్సాహం అందించారు.



వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, కూటమి నాయకులు



స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన ప్రత్తిపాటి

పారిశుధ్య కార్మికుల కష్టం తెలిసిన వ్యక్తి సీఎం

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
● అసత్య ప్రచారాలు ఆపకపోతే బొల్లాపై పరువునష్టం దావా
● వినుకొండ అభివృద్ధి, వరికెపూడిశెల ప్రాజెక్టుపై చర్చకు సిద్ధం

వినుకొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశుధ్య కార్మికుల కష్టం తెలుసుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనే యులు తెలిపారు. వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్య కార్మికులతో కలిసి మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగానే పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వాళ్ల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పారి శుధ్య కార్మికుల్లో శాశ్వత ఉద్యోగులకు రూ.కోటి బీమా, రూ.పది లక్షల జీవిత బీమా, 33 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నామని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు, ఔషధాలు అందిస్తున్నామన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా వారికి దుస్తులు, మాస్కులు, గ్లౌజ్‌లు అందించాలని నిర్ణయించాం. త్వరలోనే అందిస్తామన్నారు. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసి 86లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎక్కడికక్కడ వదిలేసి పోతే, దానికి శుభ్రం చేయడం తో పాటు చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నామన్నారు. కొత్తగా డంపింగ్ యార్డ్‌లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీ మణి షకీలాబేగం, ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్ స్పెక్టర్ ఇస్మాయిల్, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, బొం కూరి రోశయ్య, చౌడమ్మ, బీజేపీ నాయకుడు మేడం రమేష్, గుడిపాటి చంద్ర శేఖర్, కవలకుంట్ల జాన్‌బాబు, సుజాత, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరికెపూడిశెలను పూర్తి చేస్తాం

వరికెపూడిశెల ప్రాజెక్టుకు రూ.1925కోట్లు ఇచ్చిన ముఖ్యమంత్రికి చీఫ్‌విప్ జీవీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో కచ్చితంగా పూర్తి చేస్తామమన్నారు. ఆ ప్రాజెక్టుకు పైసా డబ్బులు తేలేని, ఇటుక కూడా పెట్టని మాజీ ఎమ్మెల్యే బొల్లా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా ఇంకా అదుపు తప్పితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, పరువు నష్టం దావా కూడా వేయాల్సి ఉంటుందని జీవీ హెచ్చరించారు. రోజురోజుకీ దిగజారి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. వినుకొండలో జరిగిన అభివృద్ధి గురించి ఎప్పుడైనా చర్చకు సిద్ధమన్నారు.

ప్రజల సహకారంతోనే హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల స్వచ్ఛంద సహకారం ఉంటేనే హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాకారమవుతుందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్ట ణంలోని 10వ వార్డులోని గుర్రాల చావిడి ప్రాంతంలో చేపట్టిన స్వచ్ఛ చిలకలూరిపేట కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నా టారు. 9వ వార్డులో స్థానిక విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యశిబిరం ఏర్పాటుచేసిన స్థానిక వైద్యురాలు శ్రీమతి నాగలక్ష్మి, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

37 మందికి సీఎం.ఆర్.ఎఫ్ చెక్కుల అందచేత

నియోజకవర్గంలోని 37 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.47.17 లక్షల విలు వైన చెక్కులను ఎమ్మెల్యే పుల్లారావు శనివారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో అందచేశారు.

అంజిరెడ్డి హాస్పిటల్లో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్లో ఇటీవల ఇద్దరు చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్‌లను అమర్చినట్లు వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ అంజిరెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాలలో ఏర్పాటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన రెండు సంవత్సరాల లేరే నా క్లియ, ఏలూరు జిల్లా పాములవారిగూడెంకు చెందిన ఐదు సంవత్సరాల జెస్సికా ప్రదీపకు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు నిర్వ హించినట్లు ఆయన తెలిపారు. వీరిద్దరికి శనివారం ఆయన స్విచ్ ఆన్ చేసి శబ్దాలు వినిపించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ సిబ్బంది సర్జరీ చేయించుకున్న బాలికల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చిన బాలికలతో వైద్యశాల సిబ్బంది

విద్యార్థులకు క్రీడా దుస్తుల బహూకరణ

రొంపిచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలో 1997-98 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు పాఠశాలలోని క్రీడాకారులకు దుస్తులను శనివారం బహూకరించారు. 70మంది విద్యార్థులకు రూ.25వేలు విలువ చేసే దుస్తులు అందజేశారు. పూర్వ విద్యార్థులు మహమ్మద్ ఆలీ, కోటిరెడ్డి, లక్ష్మీనారాయణ, రవీంద్రారెడ్డి, ముత్తయ్య, వెంకటరెడ్డి, సాంబశివరావు, అంతర్‌వలి చేతుల మీదుగా విద్యార్థులకు బహూకరించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ పుల్ల య్య, అబ్దుల్ సత్తార్, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు ముగిసిన శిక్షణ

రొంపిచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ వలి శిక్షణను ఇచ్చారు. ఇంటి పన్ను, వ్యాపార సముదాయాలు, ఖాళీ స్థలాలు, వంటి వాటి ద్వారా ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాథ్యూబాబు, సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

హరిత రాయబారులు, గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు

రొంపిచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హరిత రాయబారులు, గ్రీన్ అంబాసిడర్లకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో మాథ్యూబాబు తెలిపారు. వైద్యాధికారి నిమ్మల సాయిబాబు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట బస్ డిపోలో కొత్త యూనియన్ ఏర్పాటు

చిలకలూరిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో టీఎస్‌టీయూసీ కార్మిక యూనియన్‌ను రాష్ట్ర యూనియన్ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు నేతృత్వంలో నెలకొల్పాలని శనివారం నిర్ణయించారు. దసరా పండగ రోజు యూనియన్‌ను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి సమక్షంలో ప్రారంభించాలని నిర్ణయించారు. డిపో యూనియన్ కార్యదర్శిగా అద్దంకి వరప్రసాద్‌ను ఎన్నుకున్నారు. యూనియన్ సభ్యులు దసరా రోజున జెండా ఆవిష్కరణకు రావాలని ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించారు.

డ్వాక్రా రుణాలకు సభ్యుల వేలిముద్రలు తప్పనిసరి

శావల్యాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పొదుపు తదితర రుణాలు పొందాలంటే రుణాలు తీసుకొనే సభ్యులతో వీవోఏలు తప్పకుండా వేలిముద్రలు వేయించాల్సిందేనని స్త్రీనిధి జిల్లా మేనేజర్ రాహుల్ తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతితో కలసి శనివారం వీవోఏలకు బయోమెట్రిక్ డివైజ్‌లు పంపిణీ చేశారు. రాహుల్ మాట్లాడుతూ మండలంలో 26 గ్రామసంఘాలుండగా ప్రతిసంఘానికి ఒక్కో బయోమెట్రిక్ డివైజ్‌ను ప్రభుత్వం అందజేసిందన్నారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళల వేలిముద్ర ఉంటేనే రుణాలు పంపిణీ చేస్తుందన్నారు. ఇన్‌చార్జి ఏపీఎం రామారావు, సీసీలు కరుణమ్మ, మేరీ, అకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో 23న మెగా వైద్యశిబిరం

చిలకలూరిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రిలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్, అభియాన్‌లో భాగంగా ఈ నెల 23న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభించి మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శిబిరంలో మహిళలకు ప్రత్యేకంగా గర్భా శయ, రొమ్ము, నోటి క్యాన్సర్ల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. శిబిరాన్ని ఏరియా హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్, ఎమ్మెల్యే పుల్లారావు ప్రారంభిస్తారన్నారు.

విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్

చిలకలూరిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో అనేక విద్యాసంస్థల వారు విద్యార్థుల సర్టిఫికెట్లను ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ చేయలేదన్న కారణంతో ఆ సంస్థలోనే ఉంచుకొని విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని పల్నాడు జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ శనివారం తెలిపారు. వీరిలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు, ఉద్యోగాలు వచ్చిన వారు అనేక మంది ఉన్నారని, వారి ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్‌తో సహా పలు సర్టిఫికెట్‌లను విద్యాసంస్థల వారు అట్టిపెట్టుకొని విద్యార్థులను మానసిక వేదనకు గురి చేస్తున్నారని పేర్కొ న్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను వారి నుంచి అండర్ టేకింగ్ తీసుకొని విద్యార్థులకు ఇచ్చేయమని ఉప లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు తెలుగు సినిమా పాటల పోటీలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం గాన కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ క్లబ్ సహకారంతో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లో ఉన్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసి యేషన్ హాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. రాత్రి 8 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు రంగస్థల సీనియర్ నటులు ఆళ్ళ హరిబాబును ఘనంగా సత్కరిస్తారని పేర్కొన్నారు. ముగింపు సభలో ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొంటారని తెలిపారు.

టీడీపీ అధ్యక్ష పదవికి రాజీనామా

నాదెండ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్న బండారుపల్లి సత్యనారాయణ తన పదవికి శనివారం రాజీనామా చేసినట్లు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌కు రాజీనామా లేఖను పంపినట్లు వివరించారు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన సీహెచ్ అనీల్, ఎం.సుబ్బారావు, కోటయ్య స్వామి, శ్రీనివాసరావు, చెన్నకేశవులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

పలు క్రీడా పోటీల్లో చిలకలూరిపేట విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా కాజీపాలెం హైస్కూల్ లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 19 అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక శారదా హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు పి.సాల్మన్ రాజు, ఎస్.కె మౌలాలి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చిలకలూరిపేట ఏఎంజీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో శారదా హైస్కూల్ విద్యార్థులు రాజు, కే దుర్గాభవాని టంకటలో, సీహెచ్ ప్రసంగి, పద్మనాగశ్రీ నెట్‌బాల్‌లో, పి.సల్మాన్ రాజు బాక్సింగ్‌లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్19 విభాగంలో నెట్ బాల్ పోటీలో జీవీఐటీ పాఠశాలకు చెందిన షేక్ నాగూర్ వలి, కక్కెర వెంకట విఖ్యాత్, పాలపాటి సంధ్య ఎంపికయ్యారు. అండర్ 19 కరాటేలో టెన్త్ విద్యార్థులు 45 కేజీల విభాగంలో కంభంపాటి బ్రహ్మ శ్రీనిధి, 70 కేజీల విభాగంలో శ్రీరామ్ బ్రహ్మేష్ ఎంపికయ్యారు. స్కూల్ స్పోర్ట్స్ అసోసియేషన్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో జరిగిన సౌత్ జోన్ త్రోబాల్ పోటీల్లో స్థానిక ఆర్వీ ఎస్‌సీవీఎస్. ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ జట్టులో పాల్గొని అండర్ 14 బాలికల విభాగంలో ప్రథమ, అండర్17 బాలి కల విభాగంలో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన సత్కారం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురులింగంను శనివారం విద్యార్థులు ఘనంగా సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది సుధాకర్, సుబ్బారావు, ఫాతిమారాణి, అపర్ణ, ఎస్ఎంసీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలకు ఆరోగ్యం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలందరికి ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గుంటూరు రోడ్డు పరిసరాల్లో శుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ దేశ రాష్ట్ర నాయకుల అడుగుజాడల్లో నరసరావుపేట నియోజకవర్గం సాగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

రొంపిచర్ల మండలంలో....

రొంపిచర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామా ల్లో స్వచ్ఛాంధ్ర, స్వ ర్ణాంధ్ర కార్యక్రమాలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా రొంపి చర్ల మార్కెట్ యార్డు సమీపంలో చెత్తను గ్రీన్ అంబాసిడర్లు తొలగించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్ర మాలు జరిగాయి. ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ వలి మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను రోడ్లపై వేయరాదన్నారు. తడి, పొడి చెత్తలను వేరుగా ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పడాల చక్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి సాకారం చేయాలని మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి సెంటర్ వరకు శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీని నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కారుమంచి ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని, శావల్యాపురం పీహెచ్‌సీలో సఫాయిమిత్ర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామపబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, ప్రిన్సిపల్ రత్నకుమారి విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. వయ్యకల్లులో సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, చిన్నకంచెర్లలో సర్పంచ్ పూరేటి నాగేశ్వరరావు, టీడీపీ నేతలు పూరేటి వెంకట్రావు, వడ్లమూడి వెంకటకోటయ్య, గోపు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, శ్రీవల్లి పాల్గొని డంపింగ్ యార్డుల్లో మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు.

నాదెండ్లలో....

నాదెండ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాదెండ్ల గ్రామంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి పాల్గొన్నారు.

బోధనలో మెలకువలకు క్లస్టర్ సమావేశాలు దోహదం

బొల్లాపల్లి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు క్లస్టర్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జీ చినపరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మేళ్ళ వాగు, రావులాపురం, వెల్లటూరు, బొల్లాపల్లి గ్రామాల్లో క్లస్టర్ సమావేశాలు నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో చిన్నపరెడ్డి మాట్లాడుతూ బోధనలో మెళకువలు నేర్చుకోవటానికి క్లస్టర్ సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో ఆయా క్లస్టర్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

యూరియాపై అసత్య ప్రచారాలను నమ్మవద్దు : సొసైటీ చైర్మన్

శావల్యాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూరియాపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని శావల్యాపురం సొసైటీ చైర్మ న్ గడిపూడి విశ్వనాథం తెలిపా రు. స్థానిక సొసైటీ కార్యాలయంలో శనివారం డీఏవో కార్యాలయ ఏడీఏ హనుమంతరావు, అధికారులతో కలసి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ శావల్యాపురం, కారుమంచి సొసైటీలు, మనగ్రోమోర్‌కు ప్రభుత్వం 28.8 టన్నులు యూరియా పంపగా రైతులందరికీ పారదర్శకంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, డీసీచైర్మన్ మందలపు వెంకటనారాయణ, సొసైటీ డైరెక్టర్ గద్దె వీరమస్తాన్‌రావు, ఇన్‌చార్జి ఎంఏవో రామారావు, సొసైటీ సీఈవోలు నాగప్రసాద్, వెంకటనారాయణ, సిబ్బంది రామాంజి, సతీష్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో స్వచ్ఛతాహీ సేవ



కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు

వినుకొండటౌన్, సెప్టెంబ రు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డీఎం నాగే శ్వర రావు ఆధ్వర్యంలో గ్యారేజీలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛతాహీ కార్యక్రమం శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డీఎం కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్టీసీ ఆవరణలోని వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధి కారులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం రూ.21.10లక్షలు

ఈపూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చర్ల గ్రామంలో మంగళవారి చెరువులో చేపలు పెంపకం కోసం శనివారం వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో నలుగురు పాల్గొన్నారు. వారిలో ఈపూరు గ్రామానికి చెందిన రాపర్ల నరేంద్రబాబు రూ.21.10 లక్షలకు పాట పాడుకున్నట్లూ పంచాయతీ సెక్రటరీ తిరుపతయ్య తెలిపారు. వేలం పాట ద్వారా వచ్చిన డబ్బులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. పాట పాడినవారు 1435, 1436 పసలీల వరకు చెరువులో చేపలను పెంచుకోవచ్చు అన్నా రు.

మీసేవా కేంద్రాన్ని పరిశీలించిన డీఎల్‌డీవో

నూజెండ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీసేవా కేంద్రాన్ని నరసరావుపేట డీఎల్‌డీవో ఎం వెంకటరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలను దరఖాస్తుదారులను అడిగి తెలుసుకున్నారు. పారదర్శ కంగా సేవలు అందించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు.

వీ అప్పాపురం వైద్యశిబిరం

నూజెండ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, బీపీ, టీబీ పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వహీద, దీపిక, మంజూష, వై శాంతకుమారి, బీ మనోహర్ జోషి, బీ చినమస్తాన్, యూ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

బొల్లాపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి, రేమిడి చర్ల గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పది రోజుల పాటు అమ్మవార్లకు వివిధ అలంకరణలు చేస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయా ఆలయాల నిర్వాహకులు కోరారు.